క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



పేదలకు సరకులు పంపిణీ చేస్తున్న విశ్రాంత తహసీల్దార్ బాపిరాజు, బసవరాజు, రత్నప్రసాద్

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరకులను సోమవారం పంపిణీ చేశారు. దాత బసవరాజు ఆర్థిక సహకారంతో పేదలతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సరకులు అందజేశారు. విశ్రాంత తహసీల్దార్ బాపిరాజు మాట్లాడుతూ మన సంపాదనలో కొంత మొత్తాన్ని పేదలకు సాయం చేయాలన్నారు. అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, శ్రీవాణి, స్వామి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సోమవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. గాంధీనగర్, ప్రతాప్‌నగర్, శ్రీరామ్‌నగర్, గుడారిగుంట, శంతనపురి కాలనీ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులను పరిశీలించారు. తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, ర్యాంప్ వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. మౌలిక సదుపాయాల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కె.అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు హాజరై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి, పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవ్వాలని ఎంపీడీఓ తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

కాకినాడ సిటీ: కాకినాడ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ ప్రాజెక్టు అధికారి ఎ.జ్యోతి సోమవారం తెలిపారు. గైగోలుపాడు-1 ఓసీ ఓహెచ్ కేటగిరీ, రమణయ్యపేట-1 ఎస్సీ, రాజీవ్‌గృహకల్ప-2 బీసీ-ఏ, బొందగుంట బీసీ-బీ, వెంకటనగర్ ఓసీ, చాకలిపేట ఎస్టీ కేటగిరీలకు కేటాయించారన్నారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థినులు స్థానిక వార్డుకు చెందిన వివాహిత మహిళై ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 2023 జులై 1 నాటికి 21 ఏళ్ల నిండి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.

కరప: మండలంలో అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సీడీపీఓ వై.లక్ష్మి తెలిపారు. పెదకొత్తూరు బీసీ-బి, వేళంగి ఓసీ (జనరల్)కు కేటాయించారన్నారు. అభ్యర్థులు కాకినాడ రూరల్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులను 22వ తేదీలోగా అందించాలన్నారు.

కొనసాగుతున్న విచారణ

సామర్లకోట: స్థానిక మసీదు సెంటర్‌లో రెండో రోజు పోలీసుల దర్యాప్తు కొనసాగింది. ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి స్టేట్ బ్యాంకులో చోరీ ఘటనపై పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి ఆధ్వర్యంలో సోమవారం దర్యాప్తు నిర్వహించారు. మసీదు సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఒక ఇల్లును ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు అద్దెకు తీసుకుని అక్కడి నుంచి బ్యాంకులో చోరీకి వెళ్లినట్లు ట్రైనీ డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ ఆదివారం నిర్ధారణకు వచ్చిన విషయం విధితమే. పది రోజుల పాటు ఆ ఇంటిలోనే ఉండి బ్యాంకు రెక్కీ చేసినట్లు నిర్ధారణ అయ్యింది. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించింది. రాజమహేంద్రవరంలో ఉంటున్న ఇంటి యజమానికి ఫోన్ చేసి నెలకు రూ. మూడు వేల అద్దెకు వారు దిగారు. ఇంటి యజమానికి వచ్చిన ఫోన్ నంబరు ఆధారంగా వివరాలు సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. ఇంటి సమీపంలో ఉన్న మాంసం దుకాణం యజమాని నుంచి డీఎస్పీ వివరాలు సేకరించారు.

తాబేళ్లను వేటాడితే చర్యలు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు ఆలివ్ రిడ్లే తాబేళ్లను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ముఖ్యంగా హోప్ ఐలాండ్ సమీపంలో వేట చేపట్టరాదని హెచ్చరించారు. ఈ తాబేళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తీరప్రాంతాల్లో మత్స్యకారులకు దీనిపై అవగాహన కల్పిస్తామన్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకూ హోప్ హైలాండు సమీపంలో వేటకు వెళ్లరాదని సూచించారు.

ఇక్కడ సెపరేటండోయ్..

- చుక్కలు చూపిస్తున్న తినుబండారాల ధరలు
- నగరంలో సినిమా థియేటర్ల వద్ద పరిస్థితి

బోట్‌క్లబ్: అక్కడ పాప్‌కార్న్ 'టాప్'కార్న్ అవుతోంది.. సమోసా కాస్త నోట్లోకి రానంటోంది.. ఇక డ్రింక్ తాగాలంటే గుటక దిగనంటోంది.. ఏ ధర చూసినా రెట్టింపే.. కొనాలంటే జేబుకు గుల్లే.. సరదాగా సినిమాకు వెళ్లేవారికి నగరంలోని థియేటర్లలో తినుబండారాల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సినిమా విరామ సమయంలో తినుబండారాలు కొనాలని పిల్లలు అడిగితే పెద్దల గుండె అదురుతోంది.. కొందరు వెనకాకుండా కొంటుంటే, మరికొందరు వెనక్కి తగ్గుతున్నారు. నియంత్రణ లేని ధరలు ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్నాయి. కాకినాడ నగరంలో 15 వరకూ సినిమా థియేటర్లు ఉన్నాయి. ఒక్క థియేటర్‌లో కూడా ఎమ్మార్పీ ధరలకు తినుబండరాలు అమ్మడం లేదని ప్రేక్షకుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. తనకు ఎంతో ఇష్టమైన హీరో సినిమాకు వెళితే అదునుచూసి చేబు గుల్ల చేస్తున్నారని అంటున్నారు. బయట మార్కెట్‌లో ధరలకు ఇక్కడకు భారీ వ్యత్యాసం ఉంటోంది. సినిమా విరామంలో కూల్ డ్రింక్స్, సమోస, పాప్‌కార్న్ తదితరాలు, ఐస్‌క్రీమ్, కోల్డ్ కాఫీ విత్ ఐస్‌క్రీమ్ వంటి తినుబండారాలు బయట మార్కెట్ కంటే రెండు రెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇక్కడ రేట్లు ఇలానే ఉంటాయని థియేటర్ సిబ్బంది చెబుతున్నారని ప్రేక్షకులు అంటున్నారు. థియేటర్‌లో తినుబండారాలు ఎక్కువ రేట్లు కదా





అని బయట కొనుగోలు చేసుకుని తీసుకు వెళుతుంటే సిబ్బంది అడ్డుపడుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. చేసేది లేక అక్కడే కొలుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

తగ్గించిన టిక్కెట్ ధరలతో ఆనందం

కొత్త సినిమా వచ్చిందంటే అధిక ధరలకు టిక్కెట్లు విక్రయించే పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికింది. దీంతో చిన్న, మధ్య తరగతి ప్రజలు కూడా కుటుంబంతో సహా థియేటర్‌కు వచ్చి సినిమా చూస్తున్నారు. టిక్కెట్ల ధరలు తగ్గించడంతో సంబర పడుతున్న ప్రేక్షకులు తినుబండరాలు రేట్లూ నియంత్రించాలని కోరుతున్నారు. థియేటర్ల యజమానులు బయట వ్యక్తులకు తినుబండారాలు అమ్ముకొనే కాంట్రాక్టు ఇవ్వడంతో వారు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

తినుబండారాలు	బయట మార్కెట్‌లో (రూ.)	థియేటర్‌లో (రూ.)
ఐస్‌క్రీమ్	20	50
కోల్డ్‌కాఫీ విత్ ఐస్‌క్రీమ్	40	80
వెజ్‌పఫ్	8	20
ఎగ్‌పఫ్	15	30
ఉల్లి సమోసా	8	15
కూల్‌డ్రింక్	10	20

దారుణంగా వసూలు



ఇటీవల హనుమాన్ సినిమాకు వెళ్లాను. నా భార్య, ఇద్దరు పిల్లలతో కలసి సినిమాకు వెళితే టిక్కెట్లకు రూ. 400 అయ్యింది. సినిమా విరామ సమయంలో డ్రింక్, సమోసా, పాప్‌కార్న్ కొంటే రూ. 250 ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇది చాలా దారుణం. ఇవే బయట కొంటే రూ. 120 అవుతుంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

–గున్నాబత్తుల స్వామి, ప్రేక్షకుడు

చర్యలు తీసుకుంటాం..



ఎమ్మార్పీ ధరలకే సినిమా థియేటర్లలో తినుబండారాలు విక్రయించాలి. నిబంధనలు పాటించకుండా అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. ప్రేక్షకులకు ఇబ్బంది ఎదురైతే తమకు ఫిర్యాదు చేయవచ్చు.

–కె.చల్లన్‌దొర, అర్బన్ తహసీల్దార్

కలెక్టర్‌ను కలసిన గగారిన్



కలెక్టర్ కృతికా శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గగారిన్, చిత్రంలో ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎస్సీ నేత జంగా గగారిన్ సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలసి కలెక్టరేట్‌కు గగారిన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు ఆమె అభినందనలు తెలిపారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీ..

కాకినాడ సిటీ: కాకినాడ ఎస్ఈబీ అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీలక్ష్మి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. చిత్తూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అదనపు ఎస్పీగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడకు వచ్చారు.

సర్టిఫికెట్ల పంపిణీ

కాకినాడ రూరల్: లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో కుట్టుశిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణరాజు పంపిణీ చేశారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలవుతుందని ఆయన తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ప్రసూన, కార్యదర్శి శ్రీదేవి రెడ్డి, కోశాధికారి శ్రీవాణి పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ పంపిణీ లక్ష్యం



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రూ.8.14 కోట్లతో సబ్‌స్టేషన్ ప్రారంభం

కాకినాడ: నగర ప్రజలకు ఎటువంటి అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్తు పంపిణీ చేయడమే లక్ష్యమని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక పర్లోపేటలో రూ.8.15 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. సుమారు 2,052 టిడ్కో గృహ సముదాయాలతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ప్రయోజనం కలిగేలా ఈ సబ్ స్టేషన్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ కొత్త సబ్‌స్టేషన్‌తో స్థానికంగా ఉండే టిడ్కో నివాసాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. బీచ్ రోడ్‌లో కూడా త్వరలోనే అధిక సామర్థ్యం కలిగిన మరో సబ్ స్టేషన్ నిర్మిస్తామన్నారు. జగన్నాథపురం ప్రాంతానికి రెండు సబ్ స్టేషన్లు అవసరమని, అవి కూడా పూర్తయితే నగరంలో అన్ని ప్రాంతాల ప్రజలకు అవాంతరాలు, లోఓల్టేజీ లేని నాణ్యమైన విద్యుత్ పూర్తి స్థాయిలో అందించవచ్చన్నారు. సబ్ స్టేషన్‌ను యుద్ధ ప్రాతిపదికన అతి తక్కువ వ్యవధిలో పూర్తి చేసిన విద్యుత్ శాఖ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, డీఈ జి.ప్రసాద్, డీఈఈ జీవీఎల్ఎన్ శ్రీనివాస్, ఏఈలు పీఎస్‌వీ ప్రసాద్, సునీల్‌కుమార్, జి.సత్యనారాయణ, కన్‌స్ట్రక్షన్స్ డీఈ డేవిడ్, ఏడీఈ ఉషారాణి, రిటైర్డ్ ఏఈ నెక్కంటి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు వాసుపల్లి కృష్ణ, ధనలక్ష్మి, కోనాడ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ మాటే గ్యారంటీ

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- చంద్రబాబువి బూటకపు హామీలు



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, కమిషనర్ వెంకటరావు



సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

కాకినాడ రూరల్: ఎన్నికల మ్యానిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటే ఒక గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో భాగంగా కాకినాడ అర్బన్‌లోని 1, 2, 3వ డివిజన్లు, రూరల్‌లోని 11 గ్రామాలకు చెందిన లబ్ధిదారులతో కాకినాడ జేఎన్‌టీయూకే ఎదురుగా గ్రౌండ్‌లో సోమవారం సభ నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు చివర్లో సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు వచ్చి గ్యారంటీ, షూరిటీ అంటున్నాడని, ఆ మాయల ఫకీరు మాటలను ప్రజలు నమ్మో స్థితిలో లేరన్నారు. సమర్థ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అయితే.. నయవంచకుడు టీడీపీ నేత చంద్రబాబు అని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 65 ఏళ్లు వచ్చినా పింఛన్ ఇచ్చేవారు కాదని, ఇప్పుడు 60 ఏళ్లకే పెన్షన్ ఇంటికి వస్తుందన్నారు. మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకోవాలన్నారు. డ్వాక్రా రుణమాఫీ నాలుగేళ్లుగా ఎంత గొప్పగా అమలు చేశామో మీకందరికీ తెలుసన్నారు.

రాష్ట్రంలో 28 వేల కోట్ల రుణమాఫీ

ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో నాలుగు విడతలుగా వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.28 వేల కోట్ల డ్వాక్రా రుణమాఫీ చేశామని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలుపుకొన్నారు. పాదయాత్రలో ఇక్కడే జగన్ బస చేశారని, ఇప్పుడు రుణమాఫీ కార్యక్రమం ఇక్కడే జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రూ.160 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. 4,824 డ్వాక్రా సంఘాలకు చెందిన 48,444 మంది లబ్ధి పొందారన్నారు. రూరల్ మండలంలోని 11 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.22.99 కోట్లు, అర్బన్‌లోని మూడు డివిజన్ల లబ్ధిదారులకు రూ.3.39 కోట్ల పంపిణీకి సంబంధించిన నమూనా చెక్కును ఎమ్మెల్యే వారికి పంపిణీ చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్ములమడక నాగమణి, గోపుశెట్టి బాబ్జీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గగారిన్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, దూనబోయిన అరుణ, అనుసూరి ప్రభాకర్, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనల్లో భాగస్వామ్యం అవసరం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యాలయాల్లో నిర్వహించే సదస్సుల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు అన్నారు. సోమవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో «ఉన్నత విద్యలో సంస్కరణలు- యువత సాధికారిత»పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సమాజ సేవను అభివృద్ధి చేయడానికి ఉన్నత విద్యామండలి కృషి చేస్తుందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ కొత్త సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లు రూపకల్పన చేసేలా విద్యార్థులను అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి చేసిన మార్పులతో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు, షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టులు వంటి వాటివల్ల న్యాక్- ఏ ప్లస్ ప్లస్‌కు దోహదపడ్డాయన్నారు. అనంతరం వైస్ చైర్మన్ రామ్మోహనరావు, వీసీ ప్రసాదరాజులను సత్కరించారు. సదస్సులో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, పీఓ తేజేశ్వరరావు పాల్గొన్నారు.



వీసీ ప్రసాదరాజును సత్కరిస్తున్న డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు

ఆర్టికల్స్ రాయడం గొప్పవిషయం

కాకినాడ రూరల్: అధ్యాపక వృత్తిలో బోధనతో పాటు పరిశోధన అంశాలపై ఆర్టికల్స్ రాయడం, పుస్తకాలు ప్రచురించడం ఎంతో గొప్ప విషయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ అన్నారు. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన అధ్యాపకులు డాక్టర్ ఇ.అప్పారావు, డాక్టర్ ఎం.శ్రీదేవి సంయుక్తంగా రచించిన «ఆపరేషన్ మేనేజ్‌మెంట్ ఏ సిస్టమాటిక్ అప్రోచ్» అనే పుస్తకాన్ని ప్రశాంతిశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి ఒక మంచి పుస్తకాన్ని అకడమిక్ గురు పబ్లికేషన్ హౌస్ వంటి సంస్థ ద్వారా ప్రచురించిన అధ్యాపకులను, డిపార్ట్‌మెంట్ వారిని అభినందించారు. పుస్తక రచయితలు అప్పారావు, శ్రీదేవి మాట్లాడుతూ ప్రస్తుతం మేనేజ్‌మెంట్ ప్రపంచంలో బిజినెస్ ఆపరేషన్ ఏ విధంగా నిర్వహించాలో ఈ పుస్తకంలో విశ్లేషణాత్మకంగా వివరించామన్నారు. బీబీఏ, ఎంబీఏ, ఎంకామ్ వంటి కోర్సులకు సంబంధించిన విద్యార్థులు ఈ పుస్తకాలను మార్కెట్లో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థల్లో కొనుగోలు చేసుకోవచ్చని చెప్పారు. డీసీఎంఎస్ హెచ్‌ఓడీ డాక్టర్ అజయ్‌రతన్, అధ్యాపకులు ఉమారజిత, హరిబాబు, విజయశ్రీ, రాధా మాధవి, గోపి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నన్నయ ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ తదితరులు

మృతుల కుటుంబాలకు ఎంపీ గీత పరామర్శ

కొత్తపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ వంగా గీత సోమవారం పరామర్శించారు. ఉప్పాడలో ఎంపీటీసీ మేరుగు యల్లాజీ తండ్రి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పొన్నాడ మాజీ సర్పంచ్ వడ్డి నూకరాజు అనారోగ్యంతో మృతి చెందగా తన భార్య, మాజీ సర్పంచ్ వడ్డి నాగమణిని, కొత్తమూలపేటకు చెందిన చింతాడ నాగేశ్వరరావు భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను ఎంపీ గీత పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ప్రముఖ సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు మదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వెంకన్న కల్యాణోత్సవానికి రారండి..

- ఎమ్మెల్యే ద్వారంపూడి పిలుపు
- రేపు వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ
- 16న స్వామివారి కల్యాణం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: భక్తుల అభీష్టానికి అనుగుణంగా లోక కల్యాణార్థం ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి పేరిట అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కాకినాడ వేదిక కానుందని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సాంబమూర్తినగర్‌లో పూర్తి రాతితో నిర్మించిన శ్రీశ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 14న విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నామన్నారు. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పర్యవేక్షణలో వైష్ణవ సంప్రదాయం ప్రకారం పురోహితులు, పండితుల సమక్షంలో బుధవారం ఉదయం 10.58 గంటలకు ఈ కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహిస్తామన్నారు. ఎలాంటి విరాళాలు వసూలు చేయకుండా, తన కుటుంబం ద్వారా రూ.4 కోట్లు వెచ్చించి రాతితో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశామని వివరించారు. నిపుణులైన శిల్పులతో ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దగలిగామని చెప్పారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఇలా..

విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 15న ఉదయం 8 గంటలకు వైభవ వేంకటేశ్వర దివ్యక్షేత్రం నుంచి ఆనందభారతి గ్రౌండ్స్ వరకు ప్రాబోధిక సేవ, తిరువీధి మహోత్సవం నిర్వహిస్తారు. కోలాట నృత్యాలు, స్వామి, అమ్మవారికి మంగళస్నానం, వనిత భక్తులకు గోరింటాకు ధరింపజేయడం వంటి కార్యక్రమాల తర్వాత వేదనాద నృత్య సంగీత సమ్మేళనంతో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దాండియా నృత్యసేవ కూడా ఉంటుందన్నారు. 16న సాయంత్రం ఐదు గంటలకు కాకినాడ రంగరాయ వైద్య కళాశాల గ్రౌండ్స్‌లో శ్రీనివాస దివ్యకల్యాణ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్టు చెప్పారు. సుమారు 30 వేల మందికి పైగా భక్తులు కల్యాణాన్ని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే వివరించారు. ఇంతటి మహా కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బాలా త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు ఉన్నారు.

దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి



సమావేశంలో ఐక్యత చాటుతున్న బీసీ కులాల నాయకులు

కాకినాడ రూరల్: జనాభా దామాషా ప్రకారం తమకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని బీసీ కులాల ఐక్య పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. రమణయ్యపేట శ్రీ కన్వెన్షన్‌లో బీసీ కులాల ఐక్య పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లంగి వేణుగోపాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దీనికి బీసీ సామాజిక వర్గానికి చెందిన వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. శెట్టిబలిజ సంఘ కన్వీనర్ పంపన బుజ్జి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. వివిధ పార్టీల నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ, పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, ఆవుపాటి ఉమాశంకర్, మల్లాడి రాజు, గుత్తుల రమణ, డాక్టరు అనుసూరి పద్మలత, నురుకుర్తి వెంకటేశ్వరరావు, గుబ్బల తులసీకుమార్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారం

కాకినాడ: ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకూ నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో «జగనన్నకు చెబుదాం»లో భాగంగా సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, వివిధ విభాగాధిపతులతో కలసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పారిశుధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు సంబంధించి డయల్ యువర్ కమిషనర్‌కు 9, స్పందనకు 4 దరఖాస్తులు వచ్చాయి. ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కమిషనర్ వెంకటరావు ఆదేశించారు. ఆర్థిక, న్యాయపరమైన అంశాలు మినహా ప్రతి సమస్యనూ సత్వరమే పరిష్కరించాలని అన్నారు. కార్పొరేషన్ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, స్మార్ట్ సిటీ ఎస్ఈ వెంకటరావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరావు

కేంద్ర పథకాలపై ప్రచారం

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసేందుకు సోమవారం స్థానిక పాత బస్టాండ్, ట్రెజరీ కాలనీ ప్రాంతాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు సంబంధించిన క్యాలెండర్‌ను నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేశారు. క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బీజేపీ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ ముత్తా నవీన్, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, గట్టి సత్యనారాయణ, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు తదితరులు హాజరయ్యారు.